సాక్షి
రంగారెడ్డి

మంగళవారం । 7 । జనవరి । 2025



దర్శనానికి వెళ్లొస్తుండగా..

శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లి తిరిగివస్తున్న ఇబ్రహీంపట్నం వాసులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. 8లో▸



సమస్యలు పరిష్కరించండి

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని పీడీల సఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. 8లో▸



వసతుల కల్పనకు కృషి

మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రజావాణికి 52 ఫిర్యాదులు

అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



ప్రజావాణికి బారులు తీరిన ఫిర్యాదు దారులు

ఇబ్రహీంపట్నంరూరల్: ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదు దారులు బారులు తీరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి 52 ఫిర్యాదులు అందాయని అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. నియోజకవర్గం కేంద్రాల్లో ప్రజావాణి నిర్వహిస్తున్నప్పటికీ ఇంత పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావడం ప్రజాసమస్యలకు అద్దంపడుతున్నాయన్నారు. వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు. రెవెన్యూ శాఖకు 21 దరఖాస్తులు, ఇతర శాఖలకు 31 అర్జీలు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు'డయల్ యువర్ డీఎం'

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ అభ్యున్నతికి ప్రయాణికుల సలహాలతో పాటు సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 99592 26287 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

కళాశాల నిర్మాణానికి రూ.5లక్షల విరాళం



ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌కు నగదు అందజేస్తున్న పూర్ణచందర్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ కళాశాల నిర్మాణంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు అవ్వాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం వ్యాపారవేత్త పూర్ణచందర్ తన వంతు సాయంగా రూ.5లక్షల నగదు ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించేందుకు కళాశాల భవన నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతీ ఒక్కరి ధన్యవాదాలు తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అనంతరం దాత పూర్ణచందర్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మనించారు. ఈ కార్యక్రమంలో కాశీనాథ్ రెడ్డి, తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, బస్వఅప్ప, శేఖర్, శంకర్, ఖదీర్, అన్వర్, అశోక్, అప్పి, రవి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సురక్ష సేవా సంఘం సేవలు అభినందనీయం

ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్



ఉద్యోగాలు సాధించిన యువతతో డీసీపీ ప్రవీణ్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: నిరుపేద యువత కేంద్ర ప్రభుత్వ పోలీస్ విభాగాల్లో ఉద్యోగాలు సాధించేలా తర్ఫీదునిస్తున్న సురక్ష సేవా సంఘం సేవలు అభినందనీయమని ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ తీసుకున్న పదిమంది నిరుపేద యువతలో ఎనిమిది మంది సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ విభాగాల్లో ఉద్యోగాలు సాధించారు. దీంతో ఎనిమిది మంది యువకులు సోమవారం సురక్ష సేవా సంఘం వ్యవస్థాపకుడు కె.గోపీశంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో డీసీపీ ప్రవీణ్‌కుమార్‌ను కలిశారు. ఉద్యోగాలు సాధించిన యువతతో పాటు వారికి ఉచితంగా శిక్షణను అందించిన సేవా సంఘంను అభినందిస్తూ.. దేశ రక్షణలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి కోసం ఎవరితోనైనా

కలుస్తాం.. పోరాడుతాం

ఆరాంఘర్–జూపార్క్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

వంతెనకు డా.మన్మోహన్‌సింగ్ ఫ్లైఓవర్‌గా నామకరణం

రీజినల్ రింగ్‌రోడ్డుతో తెలంగాణ అభివృద్ధి వేగవంతం

పాతబస్తీ అభివృద్ధికి అసద్‌తో కలిసి పనిచేస్తాం..

మెట్రో రెండో దశపై ప్రధానితో మాట్లాడా...



ఆరాంఘర్- జూపార్క్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ అసదుద్దీన్, మేయర్ విజయలక్ష్మి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో/బహదూర్‌పురా /చార్మినార్: గ్రేటర్ నగరంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 11 కిలోమీటర్ల అత్యంత పొడవైన పీవీ ఎస్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం తర్వాత..తిరిగి కాంగ్రెస్ హయాంలోనే ఇప్పుడు రెండో అతి పెద్ద ఆరాంఘర్- జూపార్క్ ఫ్లై ఓవర్ ప్రారంభించుకున్నామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగా నిర్మాణమైన ఈ ఫ్లైఓవర్‌ను సోమవారం సాయంత్రం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులతో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఏపీలో కానీ, ఇప్పుడు కానీ హైదరాబాద్‌ను సమగ్రంగా అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఈ ఫ్లైఓవర్‌కు డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఫ్లైఓవర్‌గా నామకరణం చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అంటూ హైదరాబాద్ అభివృద్ధి కోసం రోడ్ల విస్తరణ, మెట్రో రైలు విస్తరణలతోపాటు గోదావరి జలాలు తేవడం ద్వారా తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, మూసీ పునరుజ్జీవం, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన తదితర కార్యక్రమాలు ఒక్కటొక్కటిగా చేస్తున్నామన్నారు. నిజాం కృషితో హైదరాబాద్ నగరానికి లేక్స్ అండ్ రాక్స్ సిటీగా ప్రపంచంలోనే ఒక గొప్ప పేరు ఉండేదని, దాన్ని నిలుపుకొని ఉంటే, ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్‌తో పోటీ పడే నగరమే ఉండకపోయేదన్నారు. కానీ కాలక్రమేణా కబ్జాదారులు, ఆక్రమణల వల్ల నగర సుందరీకరణ పూర్తిగా దెబ్బతిన్నదని, నగరంలో చిన్న వర్షం వచ్చినా వరదలు, ట్రాఫిక్ జామ్స్ తప్పడం లేదన్నారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు..

ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి కోసం మోదీతో పోరాడాల్సి వచ్చినా, అసద్‌తో కలిసి పనిచేసేందుకైనా సిద్ధమన్నారు. నగరాభివృద్ధి కోసం ఎంఐఎంతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రధాని వేరే పార్టీ అయినా నగరాభివృద్ధి కోసం మాట్లాడానన్నారు. అక్బరుద్దీన్ తన చిన్ననాటి స్నేహితుడన్నారు. పాత బస్తీ అభివృద్ధికి ఆయన అడిగిన పనులన్నింటికీ నిధులు మంజూరు చేసే జిమ్మేదారి తనదని భరోసా ఇచ్చారు. మీరాలంపై కేబుల్ బ్రిడ్జి నిర్మించి, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. చర్లపల్లి టెర్మినల్ చాలా కాలం పెండింగ్‌లో ఉండగా, తాను సీఎం అయ్యాక పనులు ముందుకు సాగాయన్నారు. టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానితో మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పాటయ్యాక గత పదేళ్లలో హైదరాబాద్ మెట్రో రైలు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్న విషయాన్ని గుర్తుచేశానన్నారు. ముఖ్యంగా గౌలిగూడ, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు సుమారు 7.5 కిలోమీటర్ల మెట్రో పనులకు ఒక్క ఇటుక కూడా పడలేదని, అందుకే హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర మంత్రిమండలి ఆమోదించాల్సిందిగా కోరినట్లు చెప్పారు.

రీజినల్ రింగ్‌రోడ్డుతో అభివృద్ధి

ఔటర్ రింగ్ రోడ్‌తో పాటు, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కూడా అత్యవసరమని, అది పూర్తయితే తెలంగాణ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రీజినల్ రింగ్ రోడ్‌తో పాటు, రీజినల్ రింగ్ రైలును, వికారాబాద్–కొడంగల్–కృష్ణా రైల్వే లైన్ కోసం కూడా కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కలుస్తా, ఎవరితోనైనా పోరాడుతా అన్నారు.



ఆరాంఘర్ ఫ్లైఓవర్ ఏరియల్ వ్యూ

ఒరిజినల్ సిటీ ఇదే..

హైదరాబాద్ పాత నగరం కాదని..ఇదే ఒరిజినల్ సిటీ అని, హైదరాబాద్ అభివృద్ధి కోసం 10 లేదా 11వ తేదీన ఎంఐఎం ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సంబంధిత అధికారులతో సచివాలయంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, తాము నిర్మించిన ఫ్లై ఓవర్‌ను రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నారని బీఆర్ఎస్ వాళ్లు చెప్పుకుంటున్నప్పటికీ, తాము అధికారంలోకి వచ్చాకే సరైన సమయానికి నిధులిచ్చి పనులు పూర్తిచేయించామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలో రూ.301 కోట్లతో సీవరేజ్ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు.

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ రాజకీయాలు..జైలు జీవితం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్తరేషన్ కార్డులు మంజూరు, రైతులకు ఈ ప్రభుత్వం సహకరించడం మంచి పరిణామమని అంటూ..రేవంత్‌రెడ్డి జైలులో ఉన్నప్పుడు తనకు వంట చేసిపెట్టిన వాళ్లను కూడా మర్చిపోకుండా పిలిపించుకుని సహాయం చేయడం మంచి పరిణామం అన్నారు. ప్రస్తుతం రాజకీయ నాయకులు జైలుకెళ్లడం సామాన్యంగా మారిందని, ఇప్పుడు మాత్రం ఎవరు..ఎంతమంది జైలుకు వెళ్తారో తనకైతే తెలియదన్నారు. తనను కూడా అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు 1998లో జైలుకు పంపారన్నారు. తాను అప్పట్లో 50 రోజులు జైలు జీవితం గడిపానన్నారు. జైలుకెళ్తే కష్టసుఖాలు బాగా

ఎంతమంది జైలుకెళ్తారో నాకైతే తెల్వదు..

తెలుస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. జూబ్లీ బస్టాండ్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో రైలును వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. మీరాలం మండి నుండి చార్మినార్ వరకు స్కైవాక్ ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ..పాతబస్తీ ఒవైసీ ఆస్పత్రి, చాంద్రాయణగుట్ట మీదుగా శంషాబాద్ వరకు నిర్మించనున్న మెట్రో రైలు ట్రిపుల్ డెక్కర్ ట్రాన్స్‌పోర్టు సిస్టంలో నడవాలన్నారు. ఇప్పటికే ఈ మార్గంలో కింద రోడ్డు ప్రయాణం కొనసాగుతుండగా పైనుంచి ఫ్లైఓవర్ ఉందన్నారు. ఈ ఫ్లై ఓవర్ పైనుంచి మెట్రో రైలు వెళ్లనుంది అన్నారు. గత ప్రభుత్వం ఓల్డ్‌సిటీని ఇస్తాంబుల్, సింగపూర్‌లా మారుస్తామన్నప్పటికీ, చార్మినార్ పాదచారుల పథకం కూడా పూర్తిచేయలేదన్నారు. టూరిజం పాలసీలో మక్కా మసీదుతోపాటు ఇతర మసీదులను కూడా చేరిస్తే బాగుంటుందన్నారు. ఓల్డ్‌సిటీలో బస్టాండ్లతో పాటు మినీబస్సులు కూడా అందుబాటులోకి తేవాలన్నారు.

కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా

- మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆయన కార్మికులతో కలిసి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డి.కిషన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ.. 2వ పీఆర్సీ ప్రకారం కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరిగా రూ.21వేలు తక్షణమే ఇవ్వాలన్నారు. కార్మికులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పెరుగుతోన్న పట్టణాల విస్తరణకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికుల సేవలకు గుర్తింపుగా ప్రతీ నెల రూ.10వేలు అద్దె ఇవ్వాలన్నారు. ఈ ధర్నాకు సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మద్దతు ప్రకటించారు. అనంతరం కలెక్టర్ సి.నారాయణరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ, తులసిగారి నర్సింహ, మండల సత్యనారాయణ, పెంటయ్య, ప్రవీణ్, మున్సిపల్ కార్మిక జిల్లా నాయకులు రవి, యాదగిరి, మైసయ్య, నాగేష్, బాబు, యాదమ్మ, హంసమ్మ, పుష్పమ్మ, జ్యోతి, సులోచన, హైమావతి, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి మార్కింగ్

ఆమనగల్లు: ఓఆర్ఆర్ నుంచి ఫోర్త్ సిటీ మీదుగా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి వరకు నిర్మించే ఎలివేటెడ్ గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు మార్కింగ్ పనులు ప్రారంభమయ్యాయి. 41.5కిలో మీటర్లకు రెవెన్యూ శాఖ నుంచి నోటిఫికేషన్ జారీ చేయగా సర్వే పనులు పూర్తయ్యాయి. ఆమనగల్లు, ఆకుతోటపల్లిలో రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ చేపట్టనున్నారు. ఆర్‌వీ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ అధికారులు 330 అడుగుల రోడ్డు నిర్మాణానికి గాను ఆకుతోటపల్లిలో ఇరువైపులా మార్కింగ్ ఇస్తున్నారు. సిబ్బందితో పాటు ఆమనగల్లు తహసీల్దార్ లలిత, ఆర్ఐ సంపత్, సర్వేయర్ రవి పాల్గొన్నారు. ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మార్కింగ్ పనులు మరో రెండు రోజుల సమయం పడుతుందని కన్సల్టెన్సీ సంస్థ వెల్లడించింది.

పనులు ఆపేయాలని వినతి

ఈ రోడ్డు పనులు ఆపాలని సాకిబండ తండా కు చెందిన పలువురు రైతులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఆమనగల్లు తహసీల్దార్ లలితకు వినతిపత్రాలు అందజేశారు. ఈ రోడ్డు నిర్మాణంతో తమ భూములు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పనులను ఆపి తమకు న్యాయం చేయాలని రైతులు మనిపాల్, బోద్య, చందర్, పాండు, రవిరాథోడ్, విజేందర్, రాజు, వినోద్ కోరారు.



గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మార్కింగ్ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ లలిత, సీఐ ప్రమోద్‌కుమార్

భారీగా పెరిగిన ఓటర్లు

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
ఇబ్రహీంపట్నం	1,72,820	1,70,121	34
ఎల్బీనగర్	3,14,613	2,91,386	133
మహేశ్వరం	2,88,519	2,75,461	66
రాజేంద్రనగర్	3,20,368	2,98,652	36
శేరిలింగంపల్లి	4,04,111	3,61,666	144
చేవెళ్ల	1,37,156	1,37,147	05
కల్వకుర్తి	1,24,414	1,22,107	02
షాద్‌నగర్	1,21,271	1,21,976	13

నియోజకవర్గాల్లో పెరిగిన ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	2023 నంబర్	2025 జనవరి
ఇబ్రహీంపట్నం	3,27,657	3,42,975
ఎల్బీనగర్	5,93,774	6,06,132
మహేశ్వరం	5,46,713	5,64,046
రాజేంద్రనగర్	5,82,114	6,19,056
శేరిలింగంపల్లి	7,32,587	7,65,921
చేవెళ్ల	2,62,084	2,74,308
కల్వకుర్తి	2,41,898	2,46,523
షాద్‌నగర్	2,36,392	2,43,260
మొత్తం	35,23,219	36,62,221

- అసెంబ్లీ ఎన్నికల అనంతరం 1,39,002 మంది కొత్త ఓటర్లు
- జాబితాను విడుదల చేసిన ఈసీ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. ప్రస్తుతం జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితా విడుదల చేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు(2023 నవంబర్) ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 35,23,219 మంది ఓటర్లు ఉండగా.. 2025 జనవరి ఆరు నాటికి వీరి సంఖ్య 36,62, 221కు చేరింది. 2023 డిసెంబర్‌లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. ప్రస్తుతం 1,39,00 2 మంది ఓటర్లు కొత్తగా వచ్చి చేరారు. జిల్లాలో అత్యధిక ఓటర్లు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉండగా, అత్యల్పంగా షాద్‌నగర్‌లో ఉండడం గమనార్హం.

26నుంచి రైతు భరోసా

- అర్హులందరికీ సాగు సాయం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



చేవెళ్లలో నిర్మించిన గోదాం, దుకాణసముదాయాలను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరావు, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మహేందర్‌రెడ్డి, యాదయ్య

చేవెళ్ల/షాబాద్: అర్హులైన వారందరికీ జనవరి 26వ తేదీ నుంచి ప్రభుత్వం రైతుభరోసా డబ్బులు అందజేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సర్దార్‌నగర్ మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి నూతన పాలక వర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధానికి అతి సమీపంలో ఉండటంతో పాటు రింగ్ రోడ్డు లోపల ఉన్న భూములు బంగారం కానున్నాయని చెప్పారు. అసలైన రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే చేసే భూములకే పెట్టుబడి సాయం అందిస్తున్నామని తెలిపారు. రైతు పండించిన పంటలకు, వారు పడిన కష్టానికి సరైన న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టంచేశారు. మొయినాబాద్ మండలంలో కొత్తగా నూతన మార్కెట్‌యార్డును ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ రైతుల సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాది లోపు రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. అన్ని రకాల వ్యవసాయ పరికరాలను సబ్సిడీ అమలు చేస్తామని తెలిపారు.

అన్నివర్గాలకు న్యాయం..

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. అన్నదాతల అభ్యున్నతికి ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతోందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని స్పష్టంచేశారు. అభివృద్ధిలో జిల్లా దూసుకుపోతోందని తెలిపారు. చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. రైతులు స్వయంగా శాస్త్రవేత్తలని తెలిపారు. విత్తనం వేసిన రోజు నుంచి పంట విక్రయించే వరకూ అన్ని రకాల పనులు చేసుకుంటూ సాగులో నిష్ణాతులుగా ఎదుగుతారని వివరించారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌ను రింగురోడ్డుకు మార్చాలని కోరారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ జంగయ్యతో పాటు పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తిమ్మారెడ్డిగూడలో రూ.5 కోట్లతో, ఏట్ల ఎర్రవల్లిలో రూ.2 కోట్లతో నిర్మించ తలపెట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. మక్తగూడ గ్రామానికి నూతన బస్సును ప్రారంభించారు. సర్దార్‌నగర్‌లో గ్రామస్తులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, భీంభరత్, రాంరెడ్డి, చల్లా మాధవరెడ్డి, దర్శన్ మాణెయ్య తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు రానీయం

సంక్రాంత్రి తర్వాత రైతు భరోసా అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూ.75 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన గోదాం, దుకాణా సముదాయలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంతోపాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జ్ పామెన భీంభరత్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు డి.వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, నాయకులు వసంతం, శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, ఆగిరెడ్డి, పాండు పాల్గొన్నారు.

సాగుచేసే వారికే సాయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

- మాట నిలబెట్టుకుంటున్న ప్రభుత్వం
- రైతులను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్‌ఎస్
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఇచ్చిన మాట ప్రకారం సాగు చేస్తున్న అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా అందజేయనుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం భూస్వాములకు, ఎస్‌ఆర్‌బిలకు, గుట్టలకు, రోడ్లకు రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందజేసి, ప్రజాధనాన్ని వృథా చేసిందని ఆరోపించారు. అలాంటి తప్పిదాలకు తావు లేకుండా.. తమ ప్రభుత్వం సాగు చేస్తున్నవారికే భరోసా ఇవ్వనుందని పేర్కొన్నారు. అన్ని వర్గాలు, ప్రజలు, రైతుల అభిప్రాయాలను సేకరించిన తరువాత, ఆర్థిక ఇబ్బందులను అధికమిస్తూ ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారని వెల్లడించారు. రైతుల ముసుగులో బీఆర్‌ఎస్ నాయకులు కండువాలు వేసుకొని తిరుగుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. గతంలో రైతులను మోసం చేసిన పార్టే.. నేడు ధర్నాలు, నిరసనలంటూ కర్షకులను తప్పుదోవ పట్టిస్తుందని తెలిపారు. ఆ పార్టీ టక్కుటమారా విద్యలు ఇక సాగవన్నారు. సమావేశంలో నాయకులు రఘు, చెంది తిరుపతిరెడ్డి, చెన్నయ్య, బస్వం తదితరులు పాల్గొన్నారు.

పంటను అమ్మేందుకు వెళ్తుండగా ప్రమాదం

ఆస్పత్రికి తరలించే క్రమంలో యువకుడి మృతి


భరత్(ఫైల్)

కందుకూరు: పంటను అమ్ముకునేందుకు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పరమేశ్ తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం బాలన్‌పల్లికి చెందిన బారు భరత్(20) ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా తమ పొలంలో పండించిన మిర్చి పంటను ఎండిన తర్వాత గ్రామస్తులు కొమ్ము దయాకర్, పసుపుల కుమార్, ఎం.రమేశ్, జి.సాయి డ్రైవర్ వెలిజల శివ కుమార్‌తో కలిసి ఆదివారం రాత్రి హైదరాబాద్ మార్కెట్‌కు బయలు దేరారు. వీరంతా బొలేరో క్యాబిన్ టాప్‌పై కూర్చున్నాడు. మార్గమధ్యలో రాత్రి 11గంటల సమయంలో శ్రీశైలం రహదారి దెబ్బడగూడ గేట్ సమీపంలో కందుకూరు నుంచి కడ్తాల్‌వైపు అతివేగంగా వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో టాప్‌పైన కూర్చున్నవారంతా కిందపడగా భరత్‌కుమార్‌కు తీవ్రగాయాలవ్వగా.. మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా భరత్ మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు సీఐ సీతారామ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ పరమేష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి


ఆకాశ్ మృతదేహం

ఇబ్రహీంపట్నం: డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. శేరిగూడ పరిధిలోని మల్లికార్జున కోళ్ల ఫీడింగ్ మిల్లులో బీహార్ రాష్ట్రానికి చెందిన ఆకాశ్(20) ఏడాదిగా పనిచేస్తున్నాడు. సోమవారం మిల్లు నుంచి కోళ్ల దానా లోడుతో డీసీఎం వ్యాన్ వెలుపలికి వస్తోంది. ఈ క్రమంలో యువకుడు వాహనం ఎక్కే యత్నం చేయగా.. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదవశాత్తు కిందపడ్డారు. దీంతో అతని పై నుంచి ముందు టైర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


కృష్ణయ్య(ఫైల్)

కేశంపేట: ఇంట్లోంచి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన పాపిరెడ్డిగూడలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కందాడ కృష్ణయ్య(62) జనవరి 1న మళ్లీ వస్తానని ఇంట్లోవారికి చెప్పి బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. అప్పటి నుంచి తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆయన ఆచూకీ లభ్యం కాలేదు. కృష్ణయ్య కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి తెల్లని పంచ, నల్లని టీషర్టు ధరించాడని, వివరాలు తెలిసిన వారు కేశంపేట సీఐ 9440904759, ఎస్‌ఐ 8712568396 నంబర్లకు తెలియపర్చాలని సీఐ కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


కిష్టయ్య(ఫైల్)

మొయినాబాద్: పురుగు మందు ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని సురంగల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సురంగల్‌కు చెందిన కుమ్మరి కిష్టయ్య(55) కూలీ. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆరోగ్యం మరింత క్షీణించడంతో మనస్తాపంతో ఈ నెల 2న ఇంట్లో పురుగు మందుతాగాడు. గమనించిన చుట్టు పక్కలవారు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి మరింత విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అన్నంపెట్టిన ఇంటికే కన్నం!

ఇబ్రహీంపట్నం రూరల్: అన్నం పెట్టిన ఇంటికే కన్నం వేశాడో వ్యక్తి. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. శ్రీవిహార్, రాగన్నగూడలో నివాసం ఉండే పెరుమల్ల అమృత, తన ఇంట్లో పనులు చేయడానికి కేతావత్ శ్రీనును నియమించుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 4న ఇంట్లో 295 గ్రాముల వెండి ప్లేటు, 30 గ్రాముల వెండి గ్లాసు కనిపించడం లేదని గుర్తించింది. అనంతరం శ్రీనుపై అనుమానం వ్యక్తం చేస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

గ్రూపుగా ఏర్పడి.. మత్తుకు బానిసై

ఒకప్పుడు నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమైన మత్తు పదార్థాల కల్చర్ ప్రస్తుతం చాపకింద నీరులా పల్లెలకు విస్తరిస్తోంది. గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించినా గుట్టు చప్పుడు కాకుండా తతంగం సాగుతోంది. గంజాయికి బానిసలుగా మారుతున్న వారిలో ఎక్కువగా విద్యార్థులే ఉండటం ఆందోళన కలిగించే విషయం.

- గ్రామాల్లో చాప కింద నీరులా గంజాయి కల్చర్
- జీవితాలు చిత్తు చేసుకుంటున్న విద్యార్థులు
- అడ్డుకట్ట వేయాలని సామాజిక వేత్తల విజ్ఞప్తి


ఇటీవల రూప్‌ఖాన్‌పేట్‌లో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న ఆబ్కారి అధికారులు

పరిగి: పట్టణంలో యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. అధికారుల కళ్లుగప్పి మరీ గంజాయి మత్తులో ఊగుతున్నారు. ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా డబ్బులను దొంగలించి గంజాయిని తాగుతున్నట్టు స్థానికంగా సమాచారం. యువత ఒక గ్రూప్‌గా ఏర్పడి గంజాయి ఎక్కడ, ఎవరి దగ్గర లభిస్తుందో సమాచారాన్ని చేర వేసుకుంటున్నారు. విక్రయదారులు సైతం అధికారుల కంట పడకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. కొత్త వారికి కాకుండా రెగ్యూలర్ కస్టమర్లకే విక్రయిస్తున్నట్టు సమాచారం. సరదాగా అలవాటైన గంజాయి, మత్తు పదార్థాలు వారి జీవితాలను మాత్రమే కాదు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. విద్యార్థుల బంగారు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తోంది. మత్తులో గొడవలు పడటం, ద్విచక్ర వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాలకు కారణం అవుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాన్ని నిర్మూలించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సామాజికవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బలవుతున్న మైనర్లు

పరిగి పట్టణంలోని రెండు, మూడు కాలనీలల్లోని యువత గంజాయికి బానిసలవుతున్నారు. అందులో ఎక్కువ శాతం మైనర్లు కావడం గమనార్హం. గతంలో కూడా పట్టణంలో గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడ్డ వారు మైనర్లే ఉన్నారు. అప్పట్లో విద్యార్థుల తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు. పట్టణంలో ఉన్న యువత ఎక్కువగా టీచర్స్ కాలనీ చివరన, ఫైర్‌స్టేషన్ కిష్టమ్మగడ్డతండా సమీపంలో, నస్కల్ వాగు పరిసరాల్లో రాత్రివేళలో గంజాయిని సేవిస్తున్నారు.

నగరం నుంచి సరఫరా

హైదరాబాద్ నుంచి ఇక్కడికి గంజాయి సరఫరా అవుతుంది. పలువురు బడాబాబులు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ఎక్కువగా మత్తుకు బానిసలుగా అవుతున్నట్లు సమాచారం. పరిగి, దోమ, పూడూరు మండలాల్లో దాదాపు వంద మంది పిల్లలు నిత్యం గంజాయి సేవిస్తున్నట్టు స్థానికంగా సమాచారం. వీరిలో కొంతమంది డ్రగ్స్‌కు సైతం అలవాటు పడినట్లు తెలుస్తోంది. ఇటీవల మండలంలోని రూప్‌ఖాన్‌పేట్ సమీపంలో గంజాయి తరలిస్తున్న యువకుడిని పట్టుకుని కేసు నమోదు చేశారు.

కఠిన చర్యలు తప్పవు

గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. గ్రామాల్లో పంట పొలాలో సాగుచేస్తున్న వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. నగరం నుంచి పట్టణానికి సరఫరా అవుతున్న దానిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. గంజాయి విక్రయించి, సాగు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– నీరజారెడ్డి, ఆబ్కారి సీఐ, పరిగి

విద్యార్థిని అనుమానాస్పద మృతి

- పూర్తిస్థాయి విచారణకు తల్లిదండ్రుల డిమాండ్
- కేసు నమోదు చేసిన ఆదిబట్ల పోలీసులు


సోని మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ ప్రైవేటు కళాశాలలో ఉంటూ నీట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా, పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన మైలపాకం అర్జున్ కూతురు సోని(19).. ఆదిబట్లలో అగస్త్య జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ.. నీట్ కోచింగ్ తీసుకుంటోంది. ఈనెల 4న జ్వరం రావడంతో ఆమెను మన్నెగూడలోని మహోనియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు చెప్పగా.. వైద్య ఖర్చులకు రూ.వెయ్యి ఫోన్ పే చేశారు. ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు కడుపు నొప్పి రావడంతో వైద్యం చేయించారు. 5న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మరోసారి కడుపునొప్పి రావడంతో అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని యశోద ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సోని మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదిలా ఉండగా.. అప్పుడప్పుడు సోనికి మైగ్రేన్ వస్తుండేదని, ఆమె మృతిపై సరైన విచారణ జరపాలని యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రూ.12 లక్షల పరిహారం..?

యువతి మృతిపై తల్లిదండ్రులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళన చేయడంతో రాత్రికి రాత్రే రూ.12 లక్షల నష్టపరిహారం చెల్లించినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నాయకులు కళాశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా.. ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో వారు పూలకుండీలు, కుర్చీలు ధ్వంసం చేయగా.. వారిపై యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యువకుడి బలవన్మరణం


మనోహర్ (ఫైల్)

శంకర్‌పల్లి: రైలు కింద పడి ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి శంకర్‌పల్లి శివారులో చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని ఫత్తేపూర్‌కు చెందిన రాములు, అంజమ్మ దంపతుల కుమారుడు మనోహర్(26) స్థానికంగా పశువుల దాణా దుకాణం ప్రారంభించాడు. ఫత్తేపూర్ శివారులోని రైల్వే పట్టాలమీదకు వెళ్లి ఎదురుగా వస్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గమనించిన స్థానికుల సమాచారం మేరకు వికారాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కాగా దుకాణం కారణంగా అప్పులై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు

మహిళ మెడలోంచి గొలుసు చోరీ

మొయినాబాద్: దైవ దర్శనానికి వచ్చిన ఓ మహిళ మెడలోంచి ఓ దుండగుడు మూడు తులాల బంగారు గొలుసు దొంగిలించాడు. ఈ ఘటన మండల పరిధి చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నగరంలోని యూసుఫ్‌గూడ ప్రాంతానికి చెందిన ఆంజనేయులు ఆదివారం కుటుంబ సమేతంగా బాలాజీ దేవాలయానికి వచ్చారు. అక్కడ ఓ దుండగుడు ఆంజనేయులు తల్లి గోవిందమ్మ మెడలోంచి బంగారు గొలుసును దొంగిలించాడు. ఇదే విషయమై సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామనిపోలీసులు తెలిపారు.

బ్లాస్టింగ్‌పై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం ఎలాంటి అనుమతి లేకుండా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు యాచారం సీఐ నర్సింహారావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. యాచారం మండలం తమ్మలోనిగూడ వెంచర్‌లో కొత్తపల్లి గ్రామానికి చెందిన రవి, శ్రీనివాసులు బ్లాస్టింగ్ చేస్తున్నారు. సమాచారం మేరకు ఇరువురిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు

ముగ్గురికి తీవ్ర గాయాలు

చింతపల్లి: ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం దేవులతండా శివారులో జరిగింది. స్థానిక ఎస్‌ఐ యాదయ్య తెలిపిన ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అందుగుల గ్రామానికి చెందిన పూరె శివ ఆటోలో అతడితో పాటు అదే గ్రామానికి చెందిన బైకాని నరసింహ, బి.శివ కలిసి దేవులతండా నుంచి మాల్ వైపు వెళ్తుండగా.. గ్రామ శివారులో మూలమలుపు వద్ద హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిపై ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురు గాయ పడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను మాల్ పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ శివ బాబాయి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా..


ప్రమాదానికి గురైన వాహనం


చికిత్స పొందుతున్న జగదీశ్వర్‌యాదవ్

ఇబ్రహీంపట్నం: శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లి తిరిగివస్తున్న ఇబ్రహీంపట్నం వాసులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆదివారం అర్ధరాత్రి తమిళనాడు-కేరళ సరిహద్దులో చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. వివరాలు.. ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బర్ల మంగయాదవ్ భర్త జగదీశ్వర్‌యాదవ్, కౌన్సిలర్లు మంద సుధాకర్, జెర్కొని బాలరాజు, మోహన్‌నాయక్‌తో పాటు కాంగ్రెస్ నాయకుడు గాజుల గోపాల్, బీఆర్‌ఎస్ నాయకుడు కర్నె

రోడ్డు ప్రమాదం

- గాయపడిన నేతలు

అరవింద్, కందుకూరు మండలం రాచలూరుకు చెందిన జంగయ్య ఈ నెల 2న శబరిమల అయ్యప్ప దర్శనానికి బయలుదేరారు. శనివారం దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా తమిళనాడు-కేరళ సరిహద్దు నాగర్‌కోయిల్(తమిళనాడు) వద్ద వీరి వాహనం అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. గమనించిన స్థానికులు గాయపడిన క్షతగాత్రులను మర్తాండం పట్టణంలోని శాలోం ఆర్థోపెడిక్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సోమవారం అక్కడికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు వెల్లడించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి


కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మల్‌రెడ్డి రాంరెడ్డి

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. సోమవారం ఆయన తొర్రూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని.. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రెండు నెలల్లో అసంపూర్తి పనులు పూర్తి చేస్తామన్నారు. రూ.80లక్షల నిధులతో పార్క్ స్థలాల చుట్టూ ఫెన్సింగ్, రూ.3.75 కోట్లతో యూజీడీ, సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతులు చేపడతామన్నారు. రూ.1.50 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్ల మరమ్మతులు, నీటి సరఫరా, అంతర్గత డ్రైనేజీ నిర్వహణకు కేటాయించామని చెప్పారు. హెచ్‌ఆర్‌డీసీఎల్ నుంచి రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్, పారిశుద్ధ్య నిర్వహణ, టీఎస్‌యూఎఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టబోయే పనలను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ హరిత ధన్‌రాజ్ గౌడ్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇబ్రహీంపట్నం రూరల్: పీడీఎస్ బియ్యం అక్రమంగా విక్రయిస్తున్న మయన్మార్ దేశానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి ఏడు క్వింటాళ్ల రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్‌కు చెందిన నూర్ అలామ్.. కొంత కాలంగా బాలపూర్ సమీపంలో రోడ్డు ప్రక్కన గుడిసెలు వేసుకొని కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. ఆటోను రోజుకు రూ.300 చొప్పున అద్దెకు తీసుకొని, లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కిలోకు రూ.10 చొప్పున చెల్లిస్తూ కొనుగోలు చేస్తున్నాడు. అనంతరం వాటిని జహంగీర్ అనే వ్యక్తికి రూ.15లకు విక్రయిస్తుంటాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆటోతో సహా 14 సంచుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. జహంగీర్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఆదర్శ పాఠశాలల ఔట్‌సోర్సింగ్ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు


పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నర్సింహులుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

చేవెళ్ల: ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆదర్శ పాఠశాలల ఔట్‌సోర్సింగ్ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను, విద్యాశాఖ కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నర్సింహారెడ్డిని వేర్వేరుగా కలిసి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఏజెన్సీ రెన్యూవల్‌తోపాటు నాలుగు నెలలుగా నిలిచిపోయిన వేతనాలను అందించాలని అధికారులకు వినతిపత్రం అందించామన్నారు. ప్రభుత్వం బడ్జెట్ రిలీజ్ చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, ఏజెన్సీల తప్పిదంతో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి నాలుగు నెలల నుంచి వేతనాలు అందడం లేదన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, విద్యాశాఖ కమిషనర్ నర్సింహారెడ్డి వెంటనే డీఈఓ సుశీంధర్‌రావుకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారని ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేద ప్రకాశ్, సభ్యులు విష్ణుప్రియ, కాశీ యాదయ్య, యాదమ్మ, మల్లేశ్, హేమలత, నవనీత, శేఖర్, రాధాకృష్ణ, సతీష్, ఉపేందర్, సుధాకర్, జంగయ్య, తదితరులు ఉన్నారు.